క్లుప్తంగా

ఎల్వోసీ అందజేత



భిక్కనూరు : మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామానికి చెందిన మందుగుల రమేష్ భార్య మందుగుల మంజుల కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతుండగా ఆపరేషన్ నిమిత్తం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్పందించి రూ. 2.5లక్షల ఎల్వోసీని మంజూరు చేయించారు. ఎల్వోసీ మంజూరు పత్రాలను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఎంపీపీ గాల్ రెడ్డి, ఎంపీటీసీ గజ్జెలి మీన దుర్గ బాబు, సుదర్శన్, నరసింహారెడ్డి, సీహెచ్ సిద్ధ, గొల్ల కళావతి, సరిత, సువర్ణ, భాగ్యలక్ష్మి, రాములు, ఎల్లం, మల్లేశం, జీవన్, తుడుం స్వామి, బాబు లోకేష్ తదితరులున్నారు.

మాచారెడ్డిలో..



మాచారెడ్డి : పాల్వంచ మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన నవదీప్ ఆపరేషన్ కోసం శుక్రవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ రూ.90 వేల ఎల్వోసీని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, ఆరేపల్లి మాజీ సర్పంచ్ లింగారెడ్డి, నాయకులు మల్లారెడ్డి ఉన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రి సందర్శించి పారిశుధ్యం పాటించాలని కార్యాలయాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. దాంతో జీపీ అధికారులు స్పందించి శుక్రవారం గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఏడవ వార్డులో పిచ్చి మొక్కలు తొలగించి చదును చేశారు. ఎంపీడీవో ప్రత్యేకాధికారి నరేష్, కార్యదర్శి శ్రవణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



బాన్సువాడ రూరల్ : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకుని తమ తల్లిదండ్రులు మోసపోకుండా జాగ్రత్త పడాలని బాన్సువాడ పోలీస్ కళాబృందం ప్రతినిధి ప్రభాకర్ సూచించారు. శుక్రవారం పోలీస్‌లైన్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో కళాబృందం సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శేషు, పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీల ఏర్పాటు



మాచారెడ్డి : మండలంలోని ఆయా గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ కార్యవర్గాలను రాష్ట్ర నాయకుడు బట్టు వెంకట్ రాములు మాచారెడ్డి మండల శాఖ అధ్యక్షుడు బట్టు రమేష్ శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎల్లంపేట గ్రామ అధ్యక్షుడిగా చుక్కాపురం నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మారుపాక లక్ష్మీనర్సు, ప్రధాన కార్యదర్శిగా కొమ్ము కుమార్. సోమారాంపేట గ్రామ అధ్యక్షుడిగా కట్కూరి నాగరాజు, ఉపాధ్యక్షులుగా పాతకాల రవి, బొడ్డు నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా మెరుగు ప్రకాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జులై 7న నిర్వహించనున్న మహా సభకు అధిక సంఖ్యలో తరలివెళ్లాలని పిలుపునిచ్చారు.

జాబ్ మేళాకు అనూహ్య స్పందన

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో శుక్రవారం టాస్క్, ప్రముఖ కంపనీల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఆయా కళాశాలల నుంచి 224 మంది అభ్యర్థులు ఈ మేళాకు హాజరయ్యారు. కంపనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 17 మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించారు. మరో 35 మందికి రెండో దశలో ఉద్యోగ అవకాశాలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల టాస్క్ మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ హరిస్మరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌లు సాయిబాబా, మనోజ్‌కుమార్, టీపీవో గణేష్, కంపనీల హెచ్‌ఆర్‌లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైతు వేదికలు

- రూ. కోట్ల నిధులు వృథా

ఎల్లారెడ్డి : రాష్ట్రంలోని రైతాంగానికి ఎప్పటికప్పుడు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిస్తూ, రైతులకు ఉపయోగపడాల్సిన రైతువేదికలు నిరుపయోగంగా మారాయి. వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలోని మూడు నాలుగు గ్రామాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ప్రతీ క్లస్టర్‌కు ఒక రైతు వేదికను నిర్మించారు. ప్రతీ రైతు వేదిక నిర్మాణానికి రూ. 22 లక్షల చొప్పున కామారెడ్డి జిల్లాలో నిర్మించిన 104 రైతు వేదికలకు రూ. 22.88 కోట్లు వెచ్చించారు. ఈ రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు వారంలో ఒక రోజు క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించాలి. వారికి సేద్యంలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని సలహాలు, సూచనలు ఇవ్వాలి. వీడియో కాన్ఫరెన్స్‌లు ఏర్పాటు చేసి వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా సూచించిన ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలి. రైతు వేదికల్లో కంప్యూటర్‌ను ఏర్పాటు చేసి రైతుల సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఇలాంటి రైతులకు ఉపయోగపడాల్సిన కార్యక్రమాలు జరగాల్సి ఉండగా ప్రస్తుతం అవన్నీ అలంకారప్రాయంగా మారాయి.



నిరుపయోగంగా మారిన లక్ష్మాపూర్ రైతు వేదిక

రసాయనాలు అందుబాటులో లేక..

అలాగే రైతువేదికల్లో వీడియోకాన్ఫరెన్స్ పరికాలు అమర్చాల్సి ఉన్నా ఎక్కడా కూడా ఆ ఏర్పాట్లు లేవు. భూసార పరీక్షలు నిర్వహించడానికి మొబైల్ సాయిల్ టెస్ట్ యూనిట్లు అందజేసినా వాటికి కావాల్సిన కెమికల్స్ అందుబాటులో లేకపోవడంతో అవి కూడా వృథాగా మారాయి. క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడానికి రైతు వేదికల్లో అనుక్షణం అందుబాటులో ఉండాల్సిన వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) వారానికోసారి నామ్ కే వాస్తేగా సందర్శిస్తున్నారు. రైతువేదికలకు నిధులు కూడా రాకపోవడంతో వేదికలన్నీ దుమ్ముపట్టిపోయాయి. నిర్వహణ నిధులు లేక ఎలాంటి అవగాహన కార్యక్రమాలు జరగక నిరుపయోగంగా పడి ఉన్న ఈ రైతు వేదికలను కమ్యూనిటీ హాల్స్‌గానైనా మారిస్తే ప్రజలకు ఉపయోగపడతాయన్న అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు.

“ ఆలస్యంగా నిధులు..



రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం నుండి రావాల్సిన నిధుల విడుదలలో ఆలస్యమౌతుండటంతో కొన్ని చోట్ల నిర్వహణ లోపించింది. అయినా కరెంట్ బిల్లుల కోసం గతంలో మంజూరైన నిధులను వాడుతున్నాం. భూసార పరీక్షల నిర్వహణకు కావాల్సిన రసాయనాలు రాకపోవడంతో పరీక్షల నిర్వహణ జరగడం లేదు. త్వరలోనే కావాల్సిన కెమికల్స్ తెప్పిస్తాం. వ్యవసాయ విస్తరణ అధికారులు క్లస్టర్ పరిధిలో అందుబాటులోనే ఉంటున్నారు.

– భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

‘అవినీతిని రూపుమాపడంలో యువతే కీలకం’

కామారెడ్డి అర్బన్ : దేశాన్ని పీడిస్తున్న అవినీతి, లంచగొండితనం, ప్రాంతీయ వాదం రూపుమాపడంలో యువత కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ‘యూత్ పార్లమెంట్’ అభిప్రాయం వ్యక్తం చేసింది. యునైటెడ్ యూత్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బాలరాజ్‌గౌడ్ ఆడిటోరియం, కళాభారతి ఆడిటోరియంలో ఈనెల 30 వరకు నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత నేషనల్ యూత్ క్యాంప్–2024లో భాగంగా రెండోరోజు ‘యూత్ పార్లమెంట్’ నిర్వహించారు. అనంతరం దేశ సమగ్రత, భాష, సంస్కృతి, కళలు, నైపుణ్యాల బదిలీ, పర్యావరణం, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై 250 మంది యువతీయువకులు గ్రూప్‌ల వారిగా చర్చించారు. కార్యక్రమంలో యునైటెడ్ యూత్ ప్రాజెక్ట్ చైర్మన్ వెంకటేశ్వర్లు, యునైటెడ్ యూత్ ప్రాజెక్ట్ వివిధ రాష్ట్రాల బాధ్యులు డాక్టర్ ఎస్ సంగ్రామ్ కేషం, సుఖీర్‌కౌర్ (పశ్చిమ బెంగాల్), అనిల్‌కొంటే(ఛత్తీస్‌ఘడ్), లక్ష్మణాచారి, ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చర్చాగోష్టిలో పాల్గొన్న యువతీయువకులు

వర్షాల కోసం పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో రెండోరోజు శుక్రవారం గ్రామస్తులు వర్షాల కోసం పూజలు చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో అద్దెకు గుర్రంను తీసుకొని తాడ్వాయికి తరలించారు. మండలంలోని చిన్నదేమి శివారులో దర్గాలో ఉన్న మొగులాల్‌ను గుర్రంపై ఉంచి గ్రామం వరకు డప్పువాయిద్యాలు, డీజే సౌండ్లతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింలు, మాజీ సర్పంచ్ సంజీవులు, వీడీసీ చైర్మన్ మేకల రాజు తదితరులున్నారు.

‘సింహారావు సేవలు మరువలేనివి’



కామారెడ్డి అర్బన్ : పశు వైద్య,పశు సంవర్థక శాఖ జిల్లా అధికారిగా డాక్టర్ కే సింహారావు అందించిన సేవలు మరిచిపోలేనివని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి అన్నారు. సింహారావు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం టీఎన్జీవో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పలువురు ఆయన సేవలను కొనియాడి సింహా రావు దంపతులను ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి బి.సాయిలు, ప్రతినిధులు చక్రధర్, దేవరాజు, సాయిలు ఉన్నారు.

వర్షాల కోసం పూజలు



నిజాంసాగర్(జుక్కల్) : వరుణుడు కరుణించి వర్షాలు సంవృద్ధి కురిపించాలని కోరుతూ శుక్రవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రం శివారులోని కబర్‌షా వలి దేవుడికి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ప్రతీ ఏటా వర్షాకాలం ఆరంభ సమయంలో మహమ్మద్ నగర్ గ్రామస్తులు కబర్‌షా వలికి ముస్లీం సాంప్రదాయ పద్ధతిలో ప్రార్థనలు చేస్తున్నారు. అనంతరం సింగితం రిజర్వాయర్ వద్ద పండుగ చేశారు. కార్యక్రమంలో గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ నాయకులు దఫేదార్ విజయ్, ఆకాష్ తదితరులున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



బాన్సువాడ : వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీర్కూర్ మండల ఆరోగ్య కార్యకర్తలు సూచించారు. శుక్రవారం వారు గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం నిల్వ నీటిని పారబోయాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా మురికి గుంటలను పూడ్చివేయాలని సూచించారు. ఏఎన్‌యంలు, ఆశకార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చలో రవీంద్రభారతిని సక్సెస్ చేయాలి

బాన్సువాడ రూరల్ : ఈనెల 1న లంబాడి హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే జాతీయ బంజారా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు నరేష్‌రాథోడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన బాన్సువాడలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడారు. మా తండాలో మా రాజ్యం అనే నినాదంతో బెల్లయ్యనాయక్ ఆధ్వర్యంలో సమ్మేళనం జరుగుతుందన్నారు. సమావేశంలో బంజారా నాయకులు చంద్రనాయక్, పోచారం రవిచవాన్, సురేష్‌కుమార్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బంజారా నాయకులు

మాజీ ప్రధాని పీవీకి ఘననివాళి



బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు చట్టం తేవాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం తేవాలని ఏఐపీకేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం లింగంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్ మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 12వేలు పింఛన్ అమలు చేయాలన్నారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ఎస్ లైన్ డివిజన్ కార్యదర్శి బాలరాజు, రైతు కూలీ సంఘం కార్యదర్శి అంబన్న తదితరులున్నారు.

ఘర్షణను రాజకీయం చేయవద్దు



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని నెమ్లి గ్రామంలో నాలుగు రోజుల క్రితం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణను రాజకీయం చేయవద్దని మాజీ ఏఎంసీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. మూడేళ్లుగా భూమి తగాదా జరుగుతోందని, కొత్తగా ఎమ్మెల్యే పోచంరం వర్గీయులు చేయించినట్లు చెప్పడం సమంజసం కాదన్నారు. ఎంపీపీ పాల్త్య విఠల్, జెడ్పీ కో ఆప్షన్ మాజీద్ ఖాన్, నాయకులు ఉన్నారు.

బడి బయట విద్యార్థిని గుర్తింపు



రామారెడ్డి : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఉపాధ్యాయుడు రాజు పిలుపునిచ్చారు. చిన్న పిల్లల చేత పనులను చేయించడం నేరమన్నారు. బడిబయట ఉన్న విద్యార్థిని గుర్తించి శుక్రవారం రామారెడ్డి ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఆ చిన్నారికి కావాల్సిన నోటుపుస్తకాలు, బ్యాగ్, చెప్పులు, డ్రెస్సు ఇప్పించి పాఠశాలలో చేర్చుకున్నారు. హెచ్‌ఎం గోపాల్‌రావు,ఉపాధ్యాయులు రాజు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు పాఠ్యపుస్తకాల విక్రయాలు



బాన్సువాడ రూరల్ : ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం డివిజన్ అధ్యక్షులు విజయ్‌కుమార్ శుక్రవారం బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్‌కు ఫిర్యాదు అందజేశారు. బాన్సువాడలో ప్రత్యేకంగా స్టోర్ తెరిచి యూనిఫాం, టై, బెల్టు, షూస్, ఇతర పాఠ్యసామగ్రి విక్రయిస్తున్నారన్నారు. విద్యార్థి సంఘం నాయకులు రాఘవ, కృష్ణ, చరణ్, పాండు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు వైద్య పరీక్షలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని భీమ్‌రాజు ఆస్పత్రిలో శుక్రవారం వృద్ధులకు, వికలాంగులకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యుడు విక్రమ్ పరీక్షలు చేశారు. కామారెడ్డి జిల్లా, లింగంపేట మండల రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మందికి వైద్య పరీక్షలు చేశారు. రెడ్‌క్రాస్ అధ్యక్షుడు రాజన్న, జిల్లా వైస్ చైర్మన్ నాగరాజ్‌గౌడ్, కోశాధికారి నరసింహం, డివిజన్ అధ్యక్షుడు రవిగౌడ్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, వైద్యులు తదితరులున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ





బీబీపేటలో మొక్కలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు, ఎల్లారెడ్డిలో..

బీబీపేట : శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిలో భాగంగా (ఏక్ పేడ్ మా కా నామ్ అమ్మ పేరిట ఒక మొక్క) ఓబీసీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓబిసి జిల్లా అధ్యక్షుడు తోట బాలరాజు మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా పీఎం మోదీ ‘ఏక్ పేడ్ మా కే నామ్’ ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బట్టుపల్లి రంజిత్ గౌడ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క రవీందర్, యువమోర్చా అధ్యక్షుడు పోసు శివ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్, మండల జనరల్ సెక్రెటరీలు అల్లం ప్రవీణ్, పిడుగు శ్రీనివాస్ తదితరులున్నారు.

మొక్కలను నాటిన బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులు శుక్రవారం మొక్కలను నాటారు. పీఎం మోదీ ఆదేశాల మేరకు ప్రతి బీజేపీ నాయకులు వారి తల్లిపేరు మీద మొక్కలను నాటాలని సూచించడంతో బీజేపీ నాయకులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీష్, రాజేష్, బాలరాజు తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా ఊరడమ్మ ఆలయ వార్షికోత్సవం



బీబీపేట : మండల కేంద్రంలోని ఊరడమ్మ అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి పలు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



పిట్లం(జుక్కల్): పిట్లం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ వారు కంటి వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ శిభిరంలో కంటి వైద్య నిపుణులు బాస్కర్ రెడ్డి 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కిషన్, సభ్యులు సంతోష్, వైద్యులు సమద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహానాలను తనిఖీ చేశారు. ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్, హోంగార్డు పాల్గొన్నారు.

7న పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం సరంపల్లి శివారులోని శ్రీ వ్యాధిహారక ఆంజనేయస్వామి ఆలయంలో వేద పండితులు గంగవరం ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో జూలై 7న ఆదివారం ఉదయం 9గంటలకు శ్రీ పార్వతి పరమేశ్వర కల్యాణోత్సవం అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణోత్సవంలో 98492 87828, 98484 27097, 93923 93223, 94400 41716 సంప్రదించాలని కోరారు.

సంక్షిప్తం

నేడు ఉచిత వైద్య శిబిరం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డిలో నేడు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఆర్డీవో మన్నె ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ మహేందర్‌కుమార్ పాల్గొననున్నారు.

‘రైతుబంధు’ అమలుపై నేడు సమావేశం

కామారెడ్డి అర్బన్ : రైతు బంధు పథకం అమలుపై ఈనెల 29న శనివారం ఉదయం 10గంటలకు అభిప్రాయాలు తెలుసుకోవడానికి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్టు కామారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు పాత లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ పోస్టులు 2, పొలిటికల్ సైన్స్ 1 పోస్టుకు పీజీలో 55 శాతం మార్కులు ఉన్న వారు వచ్చే నెల 1వ తేది సాయంత్రం 4 గంటల్లోగా దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. వచ్చే నెల 3వ తేదీన ఉదయం 10 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

బాలికల గురుకుల పాఠశాలలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీ ఉన్న సీట్లకోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్స్‌పల్ లక్ష్మీబాయి తెలిపారు. విద్యార్థులు జూలై 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశముందన్నారు. అలాగే పాఠశాలల బదిలీ కోసం కూడా ఈనె 30వతేదీ వరకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ప్రత్యేక కోర్సుల్లో ఖాళీగా సీట్లు..

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దోస్త్ ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలు జరుతున్నాయని ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం(పీఏ) బీబీఏ, బీఎస్సీ ఫారెస్ట్రీ, బీఎస్సీ ఫిషరీస్, బీఎస్సీ(బిజడ్‌సి), బీఎస్సీ(ఎంపీసీ), బీఎస్సీ(ఎంపీసీఎస్) బీఎస్సీ కంప్యూటర్‌సైన్స్(ఆనర్స్ 4యేళ్లు) కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ వివరించారు. దోస్త్ మూడవ విడత వెబ్ ఆప్షన్ జూలై 3వ తేదీ వరకు ఉన్నాయన్నారు.

గురుకులం ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామారెడ్డి : మండలంలోని ఉప్పలవాయి గ్రామంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలోని 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు మిగిలిపోయిన ఖాళీలను భర్తీ చేయుటకు విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లుగా ప్రిన్సిపల్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు వచ్చే నెల 12 లోపు httpr.tgswadtr.off.gov.in వెబ్‌సైడ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో బదిలీలను కోరుకునే విద్యార్థులు వచ్చేనెల 31 లోపు పైన తెలిపిన వెబ్‌సైడ్ ద్వారా ఆన్‌లైన్ రూ.100 చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని అటానమస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు నెట్, సెట్, పీహెచ్‌డీ వారికి ముందు ప్రధాన్యత ఇస్తామన్నారు. తెలుగులో రెండు, ఇంగ్లిష్‌లో రెండు, గణిత శాస్త్రంలో ఒకటి, కంప్యూటర్ సైన్స్‌లో ఒకటి మొత్తం ఆరు పోస్టుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు 1 జులై మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యార్హత సర్టిఫికెట్లు, దరఖాస్తు ఫారంతో అందజేయాలని అన్నారు. ఇంటర్వ్యూ 3న ఎల్లారెడ్డిలో డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు ఉంటుందన్నారు.

హైస్కూల్‌కు ‘పోడియం’ బహుకరణ

కామారెడ్డి అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కామారెడ్డి మండలం శాబ్దిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ‘పోడియం’ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు పోలబోయిన సత్యం, రోటరీ క్లబ్ కార్యదర్శి పి.రాజ నర్సింహారెడ్డి, ప్రతినిధులు గడ్డం గంగారెడ్డి, కే.సత్యనారాయణ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

దోమకొండ : మండల కేంద్రానికి చెందిన బ్రమ్మయ్యగారి స్వామి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన కుటుంబానికి గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ఆర్థికసాయం అందజేశారు. గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పున్న లక్ష్మణ్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పరశురాములు, అబ్రబోయిన రాజేందర్ తదితరులున్నారు.

విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మిగిలిఉన్న బ్యాక్‌లాగ్ ఖాళీల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నళిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మిగిలిన బ్యాక్ లాగ్ ఖాళీల ప్రవేశం కోసం ఆన్‌లైనలో 100 చెల్లించి సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. విద్యార్థుల బదిలీ కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

